క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీ



ఖాన్‌ఖాన్‌పేట అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న సీడీపీఓ

కల్లూరు: కల్లూరు పంచాయతీ పరిధిలోని ఖాన్ ఖాన్‌పేట 1,2 మరియు వీబీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం సీడీపీఓ నిర్మల జ్యోతి, సూపర్‌వైజర్లు భవాని, సంధ్యారాణిలు ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యా కార్యక్రమాన్ని స్టాక్ నిల్వలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఎస్‌కే జహీరాబేగం, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈఓ వెంకటేశ్వరరావు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ చలంచర్ల వెంకటేశ్వరరావు బుధవారం పరిశీలించారు. పాఠశాలలోని రికార్డులను పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పిల్లలకందిస్తున్న భోజన నాణ్యత పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో ప్రతిరోజు వడ్డించే మెనూ అడిగి తెలుసుకున్నారు. జ్వరాల బారిన పడకుండా ఉండేందుకు పిల్లలకు జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు లాల్ అహ్మద్, శేషకుమార్, నర్సింహారావు, కంభంపాటి వెంకటేష్, వీరాస్వామి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



నగదు అందిస్తున్న స్నేహితులు

కల్లూరురూరల్: మండలంలోని గోకవరం గ్రామానికి చెందిన బ్రాహ్మళ్ల రత్నసింగ్ తన కుమార్తె వివాహానికి అలనాటి పూర్వ విద్యార్థులైన మిత్రులు 65వేల రూపాయల నగదును వివాహ ఖర్చుల కోసం బుధవారం అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులైన ప్రస్తుతం వివిధ హోదాల్లో ఉన్న ఆర్టీఓ సంఘం వెంకటపుల్లయ్య, హౌసింగ్ శాఖ ఏఈ బొగ్గుల వెంకట్రామిరెడ్డి, కాంట్రాక్టర్ నాగేశ్వరరావుతో పాటు శ్రీనివాసరావు, వ్యాపారి నాగేంద్ర బాబు, ఉస్మాన్, పాపయ్య, కోటేశ్వరరావు, ప్రభాకర్, సుందర్‌రావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా సుధాకర్



సుధాకర్

కారేపల్లి: సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా కారేపల్లి మండలం బాజుమల్లాయి గూడెం గ్రామానికి చెందిన ఉంగరాల సుధాకర్ ఎన్నికైయ్యారు. బుధవారం ఖమ్మంలోని గిరిప్రసాద్ భవన్‌లో జరిగిన సీపీఐ నిర్మాణ మహాసభలో సుధాకర్‌ను జిల్లా కమిటీలోకి తీసుకున్నారు. జిల్లా కౌన్సిల్‌గా ఎన్నికైన సుధాకర్‌ను మాజీ ఎంపీటీసీ ధన్‌రాజ్, మాజీ సర్పంచ్ కోటమ్మ, సీపీఐ నాయకులు వెంకటేశ్వర్లు, వెంకట్‌లు అభినందించారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి



ధర్నా చేస్తున్న రైతుసంఘం నాయకులు

ఏన్కూరు: ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రుణమాఫీ చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. స్థానిక వ్యవసాయ కార్యాలయం ఎదుట బుధవారం రైతుసంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం వ్యవసాయాధికారి నర్సింహారావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు తాళ్లపల్లి కృష్ణ, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బాలాజీ, నాగేశ్వరరావు, సత్యనారాయణ రెడ్డి, లక్ష్మా తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట.. దిగుబడిలో దిట్ట

- భూసారం పెంపునకు ఉపయోగం
- ఎకరానికి 10 నుంచి 13 కిలోల విత్తనాలు
- 20 నుంచి 25 రోజుల్లో కోత దశకు..
- సాగుపై ఆసక్తి చూపుతున్న రైతులు



వరిపొలాల్లో పెరిగిన జీలుగులను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

కల్లూరురూరల్: పచ్చిరొట్ట పంట దిగుబడిలో ప్రధాన భూమిక పోషిస్తుంది. భూసారం పెంపులో దిట్ట. ఖరీఫ్ సీజన్‌లో వరినాట్లు వేసే ముందు చాలా మంది రైతులు తమ వరిమళ్లలో పచ్చిరొట్ట వేస్తుంటారు. దీంతో ఇష్టారాజ్యంగా వాడిన ఎరువుల వల్ల దెబ్బతిన్న నేలకు బలం చేకూరుతుంది. దిగుబడులు పెరుగుతాయి. వరిపంట వేస్తున్న భూములు పచ్చిరొట్ట ఎరువులను సాగుచేసి నాట్లు వేసే 20 రోజులు ముందు కలియదున్నడం వల్ల భూమికి సేంద్రియ బలం చేకూరుతుంది.

ప్రయోజనాలు ఎన్నో..

జీలుగులు చౌడు భూములు, వరి పండించే భూములకు అనుకూలం. ఎకరానికి 10 నుంచి 13 కిలోల విత్తనాలు చల్లినట్లయితే జీలుగు ఏపుగా పెరుగుతాయి. జీలుగులను పూత దశలో దున్నడం వల్ల ఎకరానికి 8 నుంచి 10 టన్నుల పచ్చిరొట్ట లభిస్తుంది. ఒక టన్ను పచ్చిరొట్టలో 6 కేజీల నత్రజని, 1.5 కేజీల భాస్వరం, 5 కేజీల పొటాష్ భూమికి లభిస్తాయి. పచ్చిరొట్టను పూత దశలో సరైన సమయంలో కలియ దున్నటం వల్ల బాగా కుళ్లి భూసారం పెరుగుతుంది. దీంతో రసాయ ఎరువుల వాడకాన్ని 25శాతం ఖర్చు రైతుకు తగ్గుతుంది. పచ్చిరొట్ట ఎరువులు భూమిని సారవంతం చేసి పంటకు మేలు చేసే సూక్ష్మజీవులను పెంపొందిస్తాయి. దీని వల్ల నేలలో నీటిని నిలుపుకునే సామర్థ్యం పెరిగి నేల కోతను నివారించి భూమిపై పొరను రక్షిస్తుంది. ముఖ్యంగా చౌడు భూముల్లో జీలుగులను వేయడం వల్ల నేలలో చౌడు తగ్గుతుంది. ఆ భూమి సాగుకు అనుకూలంగా మారుతుంది.

రైతుల్లో పెరిగిన అవగాహన..

పంట భూముల్లో పచ్చిరొట్ట ఎరువులు వాడాలని వ్యవసాయశాఖ అధికారులు గ్రామాల్లో ఏళ్లుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. పచ్చిరొట్ట వాడకం వల్ల కలిగే ఉపయోగాలు గురించి రైతులకు వివరించడంతో.. వారు పచ్చిరొట్ట వాడకంపై దృష్టి పెట్టారు. కల్లూరు మండలంలో సుమారు 11,450 ఎకరాల్లో జీలుగులు వేశారు. ప్రభుత్వం సబ్సిడీపై జీలుగులు అందిస్తోంది.

తగ్గిన జీలుగుల వినియోగం..

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో జీలుగుల వాడకం కొంత మేరకు తగ్గింది. రైతులు కరివేద పద్ధతిలో వేసవి దుక్కుల్లోనే వరి విత్తనాలు చల్లడం వల్ల జీలుగులు వేసే అవకాశం లేకుండా పోయింది. జీలుగులు పచ్చిరొట్ట వినియోగించాలంటే నార్లు పోసి నాట్లు వేసే వరి పొలాల్లోనే జీలుగులు వేసే అవకాశం ఉంటుంది. ఏది ఏమైనప్పటికీ జీలుగుల వల్ల కలిగే ఉపయోగాలను రైతులు గమనించి భూసారం పెంచేందుకు వినియోగించటం మంచి పరిణామం.

భూసారం పెరుగుతుంది..



పచ్చిరొట్ట ఎరువు వాడకం వల్ల భూసారం పెరుగుతుంది. రసాయనిక ఎరువులు వేసి భూములు గుల్ల భారీపోయాయి. జీలుగు పచ్చిరొట్ట వేసి కలియ దున్నడం వల్ల భూమికి అదనంగా బలం చేకూరుతుంది. భూసారం పెరిగి పంట దిగుబడి కూడి పెరిగే అవకాశం ఉంది.

– పెద్దబోయిన నారాయణరావు, రైతు, పుల్లయ్యబంజరు

రుణమాఫీపై ఎమ్మెల్యే రాగమయి సమీక్ష



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

సత్తుపల్లి: సత్తుపల్లి నియోజకవర్గంలోని సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ మండలాల తహసీల్దార్లు, వ్యవసాయాధికారులతో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి రైతు రుణమాఫీ, ధరణిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాగమయి నియోజకవర్గంలోని రైతుల రుణమాఫీ వివరాలు తెలుసుకొని, లబ్ధిదారుల ఖాతాల్లో మూడు విడతలుగా సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేసిన రుణమాఫీ ఖాతా వివరాలు తెలుసుకున్నారు. ప్రజల్లో రుణమాఫీపై ఉన్న నివృత్తిని తొలగించి రైతులకు బ్యాంక్ ఉద్యోగుల ద్వారా, వ్యవసాయాధికారులు పూర్తి సమాచారం అందించాలన్నారు. అనంతరం సత్తుపల్లి నియోజకవర్గం తహసీల్దార్లతో భూ సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో సత్తుపల్లి, కల్లూరు మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్, భాగం నీరజాదేవి, వెంటప్పారెడ్డి, భాగం ప్రభాకర్ చౌదరి, రాజబోయిన కోటేశ్వరరావు, వినుకొండ కృష్ణ, తోట సుజలరాణి, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

వేమన శతకాన్ని ప్రచురించటం అభినందనీయం..

విద్యార్థి దశలో మాతృభాష, నైతిక విలువలు పెంపొందించడానికి వేమన శతన పద్యాలు ఎంతగానో దోహదపడతాయని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో బుధవారం గార్లపాటి పాపాచలం, బొల్లెపల్లి సత్యనారాయణరాజు స్మారక ట్రస్ట్ ప్రచురించిన వేమన శతక పద్యాల పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ యోగేశ్వరరావు, నాయుడు వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, కిషోర్‌రెడ్డి, శ్రీనివాసరావు, జి.రామకృష్ణ, బి.మధుసూదన్‌రాజు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి



మధిర: మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

మధిర/కొణిజర్ల: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు తన మేనిఫెస్టోలో ప్రకటించిన అన్ని హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు యర్రాబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మధిర బోడెపూడి భవనంలో బుధవారం నిర్వహించిన సీపీఎం మధిర నియోజకవర్గ జోన్ కన్వీనర్ల సమావేశంలో వెంకటేశ్వరరావు మాట్లాడారు. అదే విధంగా కొణిజర్లలోని తనికెళ్ల సీపీఐ కార్యాలయంలో తనికెళ్ల మాజీ సర్పంచ్ సీపీఐ సీనియర్‌నేత పసుమర్తి సూర్యం వర్ధంతి కార్యక్రమం నిర్వహించగా.. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రైతులందరికీ రేషన్‌కార్డుతో సంబంధం లేకుండా రుణమాఫీ చేయాలని, అర్హులందరికీ ఇల్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, మహిళలకు రూ.2,500 పథకాన్ని అమలు చేయాలని, రైతు భరోసా కింద రూ.7,500 వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ, సీపీఎం నాయకులు కోటేశ్వరరావు, వరప్రసాద్, గోపాలరావు, నరసింహారావు, వీరయ్య, సైదులు, పురుషోత్తం, మాజీ సర్పంచ్ సీతారామయ్య, పీవీ రావు, విష్ణుమూర్తి, గోపాలరావు, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

మూడు గ్రామాల్లో..



మిట్టపల్లిలో పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

తల్లాడ: తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం కొత్త మిట్టపల్లి, బాలపేట, నూతనకల్ గ్రామాల్లో ఆరోగ్య వైద్యశిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు. రోగులను పరీక్షించి.. మందులు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ నీష్మ, శ్రీకాంత్, డాక్టర్ విజయ చందర్, సూపర్‌వైజర్లు పెద్ద పుల్లయ్య, యూన్సీ, లక్ష్మీ, ఎఎన్‌ఎంలు పద్మ, శిరీష, రాజు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నాగులవంచ, కోమట్లగూడెం గ్రామాల్లో..

చింతకాని: మండలంలోని నాగులవంచ, కోమట్లగూడెం గ్రామాల్లో పీహెచ్‌సీ వైద్యసిబ్బంది బుధవారం వైద్య శిబిరాలను నిర్వహించారు. రోగులను పరీక్షించి మందులను పంపిణీ చేశారు. కోమట్లగూడెంలోని వైద్యశిబిరాన్ని ఎంపీడీఓ రామయ్య సందర్శించి విషజ్వరాల నియంత్రణకు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రతను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పల్లె దవాఖాన డాక్టర్ షోయల్, ఏఎన్‌ఎం నర్సమ్మ, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొణిజర్లలో ఆయుర్వేద శిబిరం..



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కొణిజర్ల: కొణిజర్లలో బుధవారం నిర్వహించిన ఆయుర్వేద వైద్యశిబిరం విజయవంతమైంది. స్థానిక ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ తన్నీరు రాంప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్యశిబిరాన్ని మండల వైద్యాధికారి డాక్టర్ కె.రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక ఆయుర్వేద వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా దీర్ఘకాలిక వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. అనంతరం 120 మంది వృద్ధులకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు అందించారు. ఆయుర్వేద ఫార్మాసిస్టు కల్పన, కృష్ణయ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బోనకల్‌లో..

బోనకల్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి స్రవంతి అన్నారు. మండలంలోని ముష్టికుంట్ల, కలకోట, మోటమర్రి గ్రామాల్లో హెల్త్‌క్యాంప్‌లను నిర్వహించారు. ఐకేపీ కార్యాలయంలో వీఓఏలతో సమావేశం నిర్వహించారు. ప్రజలను అప్రమత్తం చేసేలా వీఓఏలు పని చేయాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ శ్రీనివాసరావు, ఏఎన్‌ఎమ్‌లు, ఆశాలు ఉన్నారు.

ఇంటింట ఓటర్ల సర్వే



ఆర్డీఓ రాజేందర్

కల్లూరు: కల్లూరు డివిజన్ పరిధిలో ఇంటింట ఓటర్ల ప్రత్యేక సర్వే కార్యక్రమం ప్రారంభైనట్లు ఆర్డీఓ ఎల్.రాజేందర్ పేర్కొన్నారు. బుధవారం ఆర్డీఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 2025 ఓటర్ల సవరణ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 20 నుంచి అక్టోబర్ 18 వరకు కల్లూరు డివిజన్ పరిధిలో గల కల్లూరు, తల్లాడ, పెనుబల్లి, సత్తుపల్లి, వేంసూరు మండలాల్లో గల గ్రామాల్లో బూత్‌స్థాయి అధికారులు సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తారని పేర్కొన్నారు.

సీపీఐలో చేరికలు



పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న కూనంనేని

బోనకల్: మండలంలోని ముష్టికుంట్ల, చిరునోముల గ్రామాలకు చెందిన పలువురు ఖమ్మంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సమక్షంలో బుధవారం పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బాస్కర్‌రావు, ప్రసాద్, జయరాజు తదితరులున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ఆనందరావు, రామాంజనేయులు, రోషన్‌కుమార్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థుల నిరసన ర్యాలీ



సత్తుపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సత్తుపల్లిటౌన్: కలకత్తాలో వైద్య విద్యార్థిని మోమితపై దుర్మార్గులు పాశవికంగా అత్యాచారం చేసి క్రూరంగా హత్య చేయడాన్ని నిరసిస్తూ సత్తుపల్లి పట్టణంలో తేజా ఒకేషన్ పారామెడికల్ కళాశాల ఆధ్వర్యంలో వైద్య విద్యార్థులు పట్టణంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. కాకతీయ విద్యాసంస్థల కరస్పాండెంట్ కూసంపూడి మధుసూదన్‌రావు పచ్చజెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో కాకతీయ విద్యాసంస్థల కరస్పాండెంట్ కూసంపూడి మధుసూదన్‌రావు, డైరెక్టర్ జి.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రావు, ఆధ్యాపకులు జె.రాజు, ఎ.వెంకటేశ్వరరావు, డి.వెంకటేశ్వరరావు, టి.వెంకటకృష్ణ, అంజిబాబు, మహేష్, గౌతమి, శిరీషలు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ సేవలు వినియోగించుకోవాలి

చింతకాని: పాక్షిక పక్షవాతం, శారీరక అంగవైకల్యం కల్గిన పిల్లల కోసం నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఫిజియోథెరపిస్ట్ వల్లూరి వసంత తెలిపారు. మండలంలోని లచ్చగూడెం ఉన్నత పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో మండల విద్యాశాఖాధికారి పర్యవేక్షణలో ఫిజియోథెరపీ సేవలు అందించారు. పాక్షిక అంగవైకల్యం కల్గిన పిల్లలకు అవసరమైన సహాయ పరికరాలను అందజేయటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్పీలు కేఎస్ కృష్ణారావు, భూక్యా దస్లీ, భవిత కేంద్రం సంరక్షకురాలు లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ప్రిన్సిపాల్‌కు సన్మానం



ప్రిన్సిపాల్ మీటకోటి సింహాచలాన్ని సన్మానిస్తున్న అధ్యాపకులు

కారేపల్లి: కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తించి ఏన్కూర్ మండలానికి బదిలీపై వెళ్లిన ప్రిన్సిపాల్ మీటకోటి సింహాచలాన్ని అధ్యాపక బృందం, విద్యార్థులు బుధవారం ఘనంగా సన్మానించారు. వీరితో పాటు, శాంతినగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తించి, కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బదిలీపై వచ్చిన విజయకుమారిని సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాస్, సుధ, రాజ్యలక్ష్మి, శేషప్రసాద్, సరస్వతి, దుర్గాప్రసాద్, యాకయ్య, పార్థసారధి పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన కానిస్టేబుల్‌కు..



పదోన్నతి పొందిన వెంకటేశ్వర్లును సత్కరిస్తున్న ఏసీపీ రెహమాన్, సిబ్బంది

వైరా: వైరా ఏసీపీ కార్యాలయంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తూ హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందిన బండి వెంకటేశ్వర్లును బుధవారం వైరా ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ ఎంఏ రెహమాన్ ఘనంగా సత్కరించారు. వెంకటేశ్వర్లు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏసీపీ కార్యాలయ సిబ్బంది అప్పారావు, బాబూజాన్, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, నాగులుమీరా, శంకర్, నాగేశ్వరరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

ఉత్తమ అంగన్‌వాడీ టీచర్‌గా సుభాషిణి



కలెక్టర్ చేతుల మీదుగా ప్రసంసా పత్రం అందుకుంటున్న సుభాషిణి

తల్లాడ: మండలంలోని మల్లవరం గ్రామానికి చెందిన టి.సుభాషిణి బుధవారం ఉత్తమ అంగన్‌వాడీ టీచర్‌గా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ చేతుల మీదుగా ప్రసంసా పత్రాన్ని అందుకున్నారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని అత్యుత్తమ సేవలందించిన మల్లవరం 4వ అంగన్‌వాడీ సెంటర్ టీచర్ సుభాషిణిని ఉత్తమ అంగన్‌వాడీ టీచర్‌గా ఎంపిక చేశారు. ఆమెను ఐసీడీఎస్ అధికారులు, గ్రామ పెద్దలు అభినందించారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



పాఠశాలలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

ముదిగొండ: ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్ అన్నారు. మండలపరిధిలోని మేడేపల్లి, ముదిగొండ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఏక్‌పేడ్ మాకే నామ్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు శ్రీపవన్‌కుమార్, మణికంఠ, భూమ్‌రాజ్, అఖిల్, పవన్, ప్రభాకర్, విజయ్‌కుమార్, యుగేందర్, కేశవ్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ సభ్యత్వ నమోదు

చింతకాని: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లోనే పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో టీఎస్‌యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1,2,3 తరగతులను అంగన్‌వాడీలకు అప్పగించటం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల మూసివేతకే దోహదపడుతుందని తెలిపారు. కొదుమూరు, వందనం, రాఘవాపురం, చింతకాని, లచ్చగూడెం, నర్సింహాపురం, నేరడ, ప్రొద్దుటూరు పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు పంపిణీ



బ్యాగులు అందజేస్తున్న సువిధ ఫౌండేషన్ సభ్యులు

కొణిజర్ల: మండలంలోని పల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సువిధ వికాస్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం బ్యాగులు, టై బెల్టులు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. విదార్థులకు తమవంతు సాయం అందిస్తున్నట్లు సువిధ వికాస్ ట్రస్టు నిర్వాహకులు అమరనేని మన్మధరావు, న్యాయవాది రవికుమార్, రిటైర్డు ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు తెలిపారు. హెచ్‌ఎం సుజాత అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో కుతుంబాక భార్గవి, గుల్జార్‌బేగం, తదితరులు పాల్గొన్నారు.

నేడు దివ్యాంగులకు వీల్ చైర్లు పంపిణీ

కల్లూరు: ఆల్మికో సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఖమ్మం నయాబజార్ స్కూల్‌లో దివ్యాంగులకు స్పెషల్ క్యాంప్ జరుగుతుందని ఐఈఆర్పీ టీచర్ సృజన పేర్కొన్నారు. ఈ క్యాంపులో అర్హులైన దివ్యాంగులకు వీల్ చైర్లు, ట్రైసైకిళ్లు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని కల్లూరు మండల దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఖమ్మం వచ్చేటప్పుడు ఆధార్ కార్డు జిరాక్స్, 2 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, యుడీఐడీ కార్డు జిరాక్స్, ఫుడ్ సెక్యూరిటీ (రేషన్ కార్డు) జిరాక్స్ తీసుకురావాలని కోరారు.

ముదిగొండలో టీఎమ్మార్పీఎస్ సమావేశం

ముదిగొండ: ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని టీఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కొత్తపల్లి నరసింహా అన్నారు. బుధవారం ముదిగొండలో నిర్వహించిన టీఎమ్మార్పీఎస్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నాయకులు నరసింహారావు, కృష్ణ, వీరబాబు, ఉపేందర్, గోపి, వేణు, బిక్షంపాల్గొన్నారు.

బంద్ విజయవంతం



సత్తుపల్లి: అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న మాలమహానాడు నాయకులు

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ, మాల మహానాడు ఆధ్వర్యంలో చేపట్టిన భారత బంద్ విజయవంతమైంది. ఈ మేరకు బుధవారం పలుచోట్ల రాస్తారోకో నిర్వహించి అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాలులర్పించడంతో పాటు వినతులు అందించారు. అనంతరం విద్యాసంస్థలను, ప్రభుత్వ కార్యాలయాలను మూసివేయించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ స్వలాభాల కోసం దళితులను విచ్ఛిన్నం చేయడానికి పన్నిన కుట్ర అన్నారు. రాజ్యాంగానికి లోబడకుండా సుప్రింకోర్టును సైతం తమ ఆధీనంలోకి తీసుకుని కేంద్రం ఏక పక్షంగా తీర్పును చెప్పించిందన్నారు. వర్గీకరణను నిలిపివేయక పోతే దేశవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



వైరాలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం



మధిరలో రహదారిపై నిరసన తెలుపుతున్న మాల మహానాడు నాయకులు



కారేపల్లిలో..



కల్లూరురూరల్: పేరువంచలో..